క్లుప్తంగా

గరుడ వాహనంపై వేణుగోపాలస్వామి



గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి గ్రామోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపి గరుడ వాహనంపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవంలో మాజీ సర్పంచ్ సత్తి సత్యనారాయణరెడ్డి, సత్తి వీర వెంకట దొరప్రసాద్‌రెడ్డి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం



అయ్యప్పస్వామి గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం మకరజ్యోతి దీపాన్ని వెలిగించి ఆకాశంలోకి వదిలారు. గ్రామోత్సవంలో గురుస్వామి తుమ్మూరి వెంకటరమణ, కమిటీ సభ్యులు బండారు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కర్పూర జ్యోతి దర్శనం



జి.మామిడాడలో మణికంఠ స్వామి కర్పూర జ్యోతి దర్శనం

పెదపూడి: మండలంలో గొల్లల మామిడాడలో మణికంఠ స్వామి మకరజ్యోతి దర్శనం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా మణికంఠ స్వామి విగ్రహం, దివ్య ఆభరణాలను గురుస్వామి కేతా అప్పలనరసయ్య, వల్లు వెంకటరమణలు శిరసున ధరించి గ్రామోత్సవం జరిపారు. భక్తులు పసుపు నీళ్ల జల్లి మంగళ హారతులతో స్వామివారికి స్వాగతం పలికి ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనారాయణ నంబూద్రి స్వామివారికి అలంకరణ పూర్తి చేసిన తరువాత ప్రత్యేక పూజలు, మంగళ హారతి నిర్వహించారు. రాత్రి 6.50 గంటలకు కర్పూర జ్యోతి రూపంలో మామిడాడ మణికంఠ స్వామి వారి జ్యోతి దర్శనం భక్తులకు కలిగింది. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. పూజా కార్యక్రమాల్లో గురుస్వామి డీఆరేకే, ఎస్‌వీఎస్ఎన్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సత్తి భగవాన్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

41 మంది పందెంరాయుళ్ల అరెస్ట్

పెదపూడి: సంక్రాంత్రి సందర్భంగా మండలంలో కోడి పందేలు ఆడిన 41 మంది పందెంరాయుళ్లను అరెస్ట్ చేశామని ఎస్ఐ శోభన్ కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం 14, 15, 16 తేదీల్లో మండలంలో కోడి పందేలు నిర్వహించిన పెదపూడి, గంగ్రేడు, కైకవోలు, జి.మామిడాడ గ్రామాల్లో కోడి పందేలు ఆడుతున్న 41 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.15,760 నగదు, 16 కోళ్లు, 16 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుండాట ఆడిన మరో 13 మందిని అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని రామదాసుపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పిడింగొయ్యి గ్రామానికి చెందిన దొండపాటి అర్జున్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

● రాజమహేంద్రవరం లలితా నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బడుగు సతీష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సంక్రాంతి సంబరం.. ఊరూరా ఉత్సాహం



రాజానగరంలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న నిర్వాహకులు



చక్రద్వారబంధంలో విజేతలకు బహుమతుల ప్రదానం

- ఘనంగా సంక్రాంతి వేడుకలు
- బంధువులతో కళకళలాడిన ఇళ్లు

రాజానగరం: సంక్రాంతి సంబరాలు నియోజకవర్గంలో అంబరాన్ని అంటాయి. స్థానిక అన్నదాన సత్రం ప్రాంగణంలో మండల ఆర్యవైశ్య సంఘం, రాజమండ్రి రోటరీ ఐకాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వంద మంది చిన్నారులకు భోగి పండ్లు వేసి, ఆశీసులు అందజేశారు. అలాగే 30 మంది ఆడపిల్లలచే గొబ్బెమ్మలను పెట్టించి, గొబ్బెమ్మ సంబరాలు నిర్వహించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా రోటరీ ఐకాన్ సహకారంతో ప్రతి పండగకూ ఆయా పండగ ప్రాధాన్యతను తెలియజేసేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండవల్లి వెంకటేశ్వర్రావు తెలిపారు. రోటరీ ఐకాన్ అధ్యక్షుడు తీగల రాజా, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

సంక్రాంతి సంబరాలలో భాగంగా చక్రద్వారబంధంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద సీతారామాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు జరిగాయి. 25 సంవత్సరాలుగా ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ముగ్గుల పోటీలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60 మంది మహిళలు పాల్గొన్నారు. సంక్రాంతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రంగవల్లులతో పోటీపడ్డారు. 8 విభాగాలలో విజేతలకు బహుమతులు అందజేశారు. తోకాడకు చెందిన ఉద్దంటి సంధ్య, కానవరానికి చెందిన సోడసాని నాగేశ్వరి, చక్రద్వారబంధానికి చెందిన దామనరాజు కుమారి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.



గోకవరంలో ఆవులకు పూజలు చేస్తున్న దృశ్యం



కోరుకొండ నరసన్న గ్రామోత్సవం

లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

మధురపూడి: సంక్రాంతిని పురస్కరించుకుని కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారు పల్లకీపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పశ్చిమగానుగూడెం, జంబూపట్నం గ్రామాల్లో ఊరేగింపు జరిగింది. అలాగే సోమ, మంగళవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. పండగ సందర్భంగా వచ్చిన అల్లుళ్లు, బంధువులతో పల్లెలు కిటకిటలాడాయి.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి

బిక్కవోలు: కనుమ పండగను పురస్కరించుకుని ఊలపల్లిలోని వెలంపేట వద్ద మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలోని ఎంపీటీసీ బండారు శివ, మాజీ ఎంపీటీసీ నెక్కల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

సీతానగరం: సంక్రాంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. కనుమ పండగ సందర్భంగా మంగళవారం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో సీతానగరం బస్టాండ్ సెంటర్ కిటకిటలాడింది.

రంగంపేట మండలంలో..

రంగంపేట: మండలంలోని గ్రామగ్రామాన భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పండగ సందర్భంగా గంగిరెద్దుల ఆటలు, వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక దేవతలను గరగ నృత్యాలతో, డప్పు వాయిద్యాలతో ఊరేగించారు.

పాడి పశువులకు పూజలు

గోకవరం: కనుమ పండగను మండల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. రైతులు తమ పాడి పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఇంటిల్లిపాది కలిసి ఆటపాటలతో సందడి చేశారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న

రంగంపేట: రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారం సాధించడం తథ్యమని జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈలకొలనులో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తన స్వగ్రామమైన ఈలకొలనులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిల ఆశీస్సులతో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి, విద్యుత్ సబ్‌స్టేషన్, సొసైటీ భవన నిర్మాణం, పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో వెలుగుబంట్ల లక్ష్మణరావు, బత్తిన సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా పొన్నాలమ్మ తీర్థం

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామ దేవత పొన్నాలమ్మ జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తారు. చివరిరోజు ఆదివారం అన్నసమారాధన జరుగుతుంది.

నాగదేవత వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో తుల్యభాగ నదీ తీరాన ఉన్న నాగదేవత ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ పడాల అబ్బులరెడ్డి, గురజాపు అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

జూద క్రీడలు వద్దు.. గ్రామీణ క్రీడలు ముద్దు

రంగంపేట: జూద క్రీడలు వద్దు.. గ్రామీణ క్రీడలు ముద్దు అనే నినాదంతో కోడి పందేలు, జూద క్రీడలకు భిన్నంగా మండల పరిధిలోని మర్రిపూడిలో సంక్రాంతి రోజున సీనియర్ సిటిజన్స్ ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. పోటీల్లో 67 ఏళ్ల నుంచి 92 ఏళ్ల వయసున్న 25 మంది పాల్గొన్నారు. బరువులు విసరడం, బెలూన్లు ఊదడం, ఎడమ చేతితో అగ్గిపుల్లలు వెలిగించడం, కొబ్బరి కాయలు కొట్టడం, అరచేతిపై నిమ్మకాయలు నిలిపి ఉంచడం, టబ్‌లోకి బంతి విసరడం తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 92 ఏళ్ల వృద్ధుడు పుట్టా అచ్చియ్య కిలోమీటర్ దూరం వేగంగా సైకిల్ తొక్కి అందరి మన్ననలు పొందారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమానికి పుట్టా వెంకటేశ్వరరావు యాంకర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో రంగంపేట మండల సాగునీటి సాధన కమిటీ కన్వీనర్ పుట్టా సోమన్నచౌదరి, గ్రామ పెద్దలు మోదుకూరి సత్తిరాజు, రిమ్మలపూడి కృష్ణమూర్తి, ముత్యాల నరసింహం, పాలకుర్తి కృష్ణ, కోరా శేఖర్, మోదుకూరి రాజేంద్ర, పుట్టా సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



మర్రిపూడిలో క్రీడా పోటీల్లో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

మదన గోపాలస్వామికి తోకల వంశస్తుల తొలిపూజ

కడియం: దుళ్ల గ్రామంలోని పురాతన రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఏటా మకర సంక్రాంతి రోజు రాత్రి తొలి పూజను తోకల ఇంటిపేరు కలవారు నిర్వహిస్తుంటారు. ఆ సంప్రదాయాన్ని కొనసాగించారు. సంక్రాంతి రోజు తోకల ఇంటి పేరుగల వారు ప్రతి కుటుంబం నుంచి ఒక్కరైనా ఈ పూజా కార్యక్రమానికి హాజరవుతారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని ఈ ఏడాదీ ఆ వంశస్తులు కొనసాగిస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ ఈ పూజ రోజున తప్పని సరిగా హాజరవుతారు. ఆలయ అర్చకుడు, ప్రముఖ వేదపండితుడు శ్రీమాన్ ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో ఖండవల్లి వాసు పూజా కార్యక్రమాలను చేపట్టారు. తోకల ఇంటి పేరు కలిగి జీవించి ఉన్నవారిలో పెద్ద వయసు భార్యాభర్తల పేరిట ఈ పూజ నిర్వహిస్తారు. వంశాభివృద్ధి కలగాలని, ప్రతి మంచి పనిలోనూ భాగస్వాములు అవ్వాలని సంకల్పం చెప్పుకుని ఈ పూజలో పాల్గొంటారు. అలాగే సంప్రదాయంగా జొన్నలు, బెల్లం కలిపిన ప్రసాదాన్ని స్వీకరించారు.



దుళ్లలోని మదనగోపాల స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న తోకల వంశస్తులు

శాస్త్రోక్తంగా గోపూజ

కడియం: స్థానిక భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని గోశాలలో మంగళవారం శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా ఆలయ అర్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో గోసంరక్షణ సేవా సమితి అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) తమ కుటుంబ సభ్యులతో కలిసి పూజలో పాల్గొన్నారు.



గోపూజ చేస్తున్న గిరజాల బాబు దంపతులు

సొంతూరి అభివృద్ధికి చేయూత

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నానికి చెందిన కల్లూరి రామకృష్ణ పరమహంస బెంగళూరులో స్థిరపడి, ఏఎంసీ విద్యాసంస్థలను నెలకొల్పారు. ఎల్‌కేజీ నుంచి మెడిసిన్ వరకు దేశ విదేశీయులకు విద్యనందిస్తున్నారు. అలాగే తన ఊరు పురుషోత్తపట్నం అభివృద్ధికి చేయూతనిస్తున్నారు. కల్లూరి రామకృష్ణ పరమహంస ఫౌండేషన్ ద్వారా పురుషోత్తపట్నంలోని ఎంపీయూపీ స్కూల్‌కు రూ.40 లక్షలతో నాలుగు గదుల భవనం, రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాలు, రూ.80 లక్షలతో వినాయక స్వామి ఆలయం, రూ.40 లక్షలతో లూథరన్ చర్చి, అలాగే మండలంలో పది చర్చిల మరమ్మతుల నిమిత్తం ఒక్కొక్క చర్చికి రూ.25 వేలు చొప్పున అందించారు. పురుషోత్తపట్నంలో 20 మంది వృద్ధులకు నెలకు రూ.400 చొప్పున, సంక్రాంతి రోజున నూతన వస్త్రాలు అందిస్తున్నారు. దేవీపట్నం మండలం గండిలో కొలువైన పోశమ్మ అమ్మవారికి రూ.లక్షతో వెండి కిరీటం, గోదావరి మధ్యలోని మహానందీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.60 లక్షలు, వంగలపూడి ఎంపీయూపీ స్కూల్‌కు రూ.40 లక్షల విలువైన స్థలం, కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం చేయడానికి రూ.30 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించారు. చినకొండేపూడిలోని వేంకటేశ్వస్వామి ఆలయానికి రూ.15.50 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ నేపథ్యంలో కల్లూరి రామకృష్ణ పరమహంస, గీతా దంపతులు సేవా స్ఫూర్తికి ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.



వృద్ధులకు పింఛన్, దుస్తులు పంపిణీ చేస్తున్న రామకృష్ణ పరమహంస, గీత దంపతులు

వైభవంగా దోసాలమ్మ జాతర మహోత్సవం

- ప్రత్యేక అలంకరణలో అమ్మవారు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ సంక్రాంతి జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు, గాజులు, చీరలు సమర్పించారు. జాతర నేపథ్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పంచలోహ విగ్రహం ఉత్సవమూర్తి రూపంలో భారీ ఊరేగింపు, సంబరం మహోత్సవం జరిపారు. ఆలయం నుంచి గరగ నృత్యాలు, వాయిద్యాలతో ఊరేగించారు. ముందుగా గౌరీచంద్ర మాహేశ్వరస్వామి ఆలయానికి తీసుకువెళ్లి పూజలు చేశారు. అనంతరం పాత బొమ్మూరు, రాజవోలు రోడ్డు, పంచాయతీ వీధి, బాలాజీపేట జంక్షన్ తదితర వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. బొమ్మూరుకు చెందిన ప్రభు ఫైర్‌వర్క్స్ గుత్తుల శ్రీను ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులు నిర్వహించారు.



దోసాలమ్మ తల్లి



ఆకట్టుకున్న గరగ నృత్యాలు

చింతాలమ్మ తీర్థం

కడియం: దుళ్ల శివార్లలో కొలువైన చింతాలమ్మ తీర్థమహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కనుమ పండగ రోజు అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కడియం, మండపేట, ఆలమూరు మండలాలకు సరిహద్దుల్లో ఉన్న ఈ అమ్మవారిని ఇష్టదైవంగా కొలుస్తారు. ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం నేపథ్యంలో దుళ్ల - మండపేట ప్రధాన రహదారిపై భక్తుల రద్దీ ఏర్పడింది.

అంగరంగ వైభవంగా తిరువాభరణోత్సవం

- మార్మోగిన అయ్యప్ప నామస్మరణ
- పాల్గొన్న జక్కంపూడి కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: అయ్యప్పస్వామి వారి తిరువాభరణోత్సవం సోమవారం అత్యంత ఘనంగా జరిగింది. ప్రకాశం నగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వగృహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళ వాయిద్యాలు, కేరళ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వైభవంగా నిర్వహించారు. గురుస్వాముల పర్యవేక్షణలో కొమ్ముల సాయి, జక్కంపూడి గణేష్ అయ్యప్పస్వామి తిరువాభరణాలను, అమ్మవారి ఆభరణాలను తలపై పెట్టుకుని కేరళ చెండై వాయిద్యాలు, కోలాటం, మేళ తాళాలు, భక్తుల నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. టీటీడీ కల్యాణ మంటపం, కంబాలచెరువు, దేవీచౌక్ మెయిన్ రోడ్డు, డీలక్స్ సెంటర్, విశ్వేశ్వరస్వామి గుడి మీదుగా అయ్యప్పస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపి స్వామివారికి తిరువాభరణాలను అలంకరించారు. అనంతరం మకరజ్యోతి రూపంలో అయ్యప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

శబరిమల తరహాలో పూజలు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు శ్రీధర్మశాస్త్ర ఆధ్యాత్మిక కేంద్రం అనే ట్రస్టును ఏర్పాటు చేసి, పవిత్ర గోదావరి తీరాన రాజమహేంద్రవరంలో శబరిమల పోలిన అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించారన్నారు. స్వామి వారి విగ్రహాన్ని పంచలోహాలతో తయారు చేయించి, శబరిమల ఆలయంలో మాదిరిగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. మన రాష్ట్రానికి సంబంధించిన భక్తులే గాక ఇతర రాష్ట్రాల నుంచి అనేక మంది ఇక్కడకు వచ్చి స్వామివారి దీక్ష విరమణ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు అనసూరి పద్మలత, జక్కంపూడి విజయలక్ష్మి, ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం, చల్లా శంకర్రావు, కేశవ రాజు, తోట సుబ్బారావు, బొంత శ్రీహరి పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి ఆభరణాలకు పూజలు చేస్తున్న జక్కంపూడి గణేష్ తదితరులు



అయ్యప్పస్వామి ఆభరణాలను తలపై మోసుకువస్తున్న జక్కంపూడి గణేష్, రాజా



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



క్షతగాత్రులను 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

సీతానగరం: రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బొబ్బిల్లంకకు చెందిన పి.నాగేంద్ర, కె.రామచరణ్, టి.మినేష్ పార్థు సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తొర్రేడులో కోడి పందేలకు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో కోడి పందేలకు వెళుతున్న ముగ్గళ్లకు చెందిన వై.కేశవ బైక్‌తో వారిని ఎదురుగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో నాగేంద్ర ఎడమ కాలు విరగగా, రామచరణ్, మినేష్ పార్థు, కేశవకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సీతానగరానికి చెందిన 108 అంబులెన్స్‌లో ఈఎంటీ ఎస్.సునీత, పైలట్ ఎస్‌దుర్గా ప్రసాద్ ఆ నలుగురికి ప్రథమ చికిత్స అందించి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. కేశవ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.